"అది కాదండీ! సరదా కదుగుతున్నా."

"…………"

"అప్పుడు నాలో ఏది మిమ్మల్ని ఆకర్షించింది?"

"………………"

"చెప్పండీ" బతిమాలింది.

"……………"

"బాబ్బాబూ" బుజ్జగించింది"

"నీ నల్లంచు తెల్లచీర…."

**(యువ, 1.4.1966)**

# చీకటి చీలింది

**"వ**ట్టి రూల్సుమనిషి. రూల్సుతో రూళ్ళ కర్రతో కొట్టినట్టు మమ్మల్ని కొడతాడు" అంటారు డాక్టరు సుబ్రమణ్యం గురించి అతని స్టేఫ్. అతను చార్జీ తీసుకోగానే వాళ్ళని ఉదయం డ్యూటీకి 8 గంటలకు రమ్మన్నప్పుడతన్ని చెప్పుతో కొట్టాలనిపించింది వారికి.

వాళ్ళను రమ్మండవే కాకుండా, అతను 8 గంటలకు ముందే వచ్చి నిన్నటి మిగిలిపోయిన శవంలా ఆస్పత్రిలో కూర్చోవడం చూస్తే, అతన్ని చెట్టుక్కట్టి మరీ చెప్పుతో కొట్టాలనిపించింది వారికి.

సుబ్రమణ్యం వట్టి రూల్సుమనిషి. పేషెంట్లు హక్కులకు సంబంధించిన రూల్సంటే సూక్తుల్లా చూసుకుంటాడు. అంచేత "చల్లన్చేయ్యి" అని అతని పేషెంట్లు మెచ్చుకునే అతని చెయ్యిని "ఏం అస్తంరా బాబూ. బస్మాసురస్తం" అని తిట్టేరు అతని స్టేఫ్. అంతే కాకుండా "గడ్డి వామిదగ్గర కుక్కలాటోడు. ఆడుతిన్డు, మరోడ్ని తిన్నివ్వడు. ఇలా టోళ్ళు మరో పదిమందివుంటే దేశం నాశనవేఁ" అని దేశభవిష్యత్తును గురించి విచారించేరు.

అందరికంటే ఎక్కువ విచారించింది, మంత్రసాని సుబ్బమ్మ. సుబ్రమణ్యం ఆమెని ఆస్పత్రికి వచ్చినప్పుడు తెల్లచీర కట్టుకోక తప్పదన్నప్పుడు, ఆమె ఆస్పత్రికి తెల్లచీర విప్పేసుకు వస్తానన్లే దెప్పుడూ, బ్లూ చీరెలు కట్టుకుంటానంది. "ఫోనీ ఎర్రచీరన్నాసరే" అంది. ఆమెకు తన సేటీన్ చూపుల్లాటి బ్లౌజులూ, తన టఫెటా మాటల్లాటి చీరెలూ ఆస్పత్రిలోనూ, బైటకూడా కట్టుకోడం అల వాటు. పాతడాక్టరు "పరమ ప్రెబువు"న్నన్నాళ్ళూ వారానికో కొత్తచీర కొనుక్కోడం అలవాటు ఈ "వామిదగ్గర కుక్కగాడొచ్చేక ఆమె రామీ పూర్తిగా పడిపోయింది. పోనీ పాతరంగు చీర్లన్నా కట్టుకోనివ్వడు "ఎదవ మొకవాఁని, ఎదవ మొకం" (అని తిట్టు కుందామె)

సుబ్రమణ్యం అజ్ఞ ప్రకారం ఆమె తన కొండంత జుట్టు ముడితో పువ్వుల్లేకుండా, అంచులేని తెల్లచీర కట్టుకొని ఆస్పత్రికి వెళ్ళినప్పుడు చెట్టంత సమితి ప్రెసిడెంటు బతికుండగానే ముండ మోసినట్టనిపించిందామెకు. ముసలి మీరాలా–ఆఖరి సీన్లో చింతా మణ్లా– కనిపించిందామె ప్రెసిడెంటుకి. ఇంకా హీనంగా చచ్చి పోయిన వెధమ్ముండ శవంలా కనిపించింది ఆమె మట్టు కామె.

సుబ్రమణ్యం ఛార్జీతీసుకున్న మర్నాడే సుబ్బమ్మని సమితి ప్రెసిడెంటుతో మితిమీరి మాటాడొద్దంటే, మితిమీరి కోపం వచ్చింది ప్రెసిడెంటుకి. అంతకంటే ఎక్కువే వచ్చింది సుబ్బమ్మకి. కోపంతో వణికిపోయింది సుబ్బమ్మ.

సుబ్రమణ్యం ఛార్జీతీసుకున్నాక నర్సులు పువ్వులెరగరు. సుబ్బమ్మ డబ్బెరగదు. తోటివాళ్ళు సారా ఎరగరు. పేషెంట్లు కష్టమెరగరు. సుబ్రమణ్యం సుఖవేఁరగడు. గొడ్డులా చాకిరి చెయ్య డవేఁ సుబ్రమణ్యం పని. "ఓ సర్దానా? ఓ సుకఁవా?" అన్నది మరచి పనిచేశాడు. అతనలా పన్చేసి వూరుకుంటే అతని స్టేపు కేం అభ్యంతరం లేదు. వాళ్ళనికూడా అలా పన్చెయ్యమంటే మాత్రం వాళ్ళ కెక్కళ్ళేని అభ్యంతరం వుంది. "ఆడికేం! ఐదొం దలొచ్చి ఒళ్ళోపడ్తాయ్ నెలయ్యేసరికి. మనలా టోళ్ళ సంగ తేమిటి?" అని వాళ్ళని వాళ్ళే ప్రశ్నించుకున్నారు. డబ్బులేక ఆత్మహత్య చేసుకున్నవాడి శవాన్ని కూడా వాళ్ళవాళ్ళకి మామూళ్ళు పుచ్చుకోందే అప్పచెప్పడం అలవాట్లేదు వాళ్ళకి.

వారం తిరక్కుండానే ఆస్పత్రిస్టేఫ్ ప్రెడిడెంటు దగ్గరికి డెప్యుటేషన్ వెళ్ళేరు. సుబ్రమణ్యం తమని పెట్టే బాధలు లేని వివరాలతో చెప్పుకున్నారు. "అతగోడు డాక్టరేటి? ఇరణ్యకసిడు. ఇనపగుండెల మడిసి. ఇలాటోళ్ళు మరో పదిమందిరుంటే దేశం బావుపణ్ణట్టే!" అని దేశభక్తి వలకపోశారు.

ఆ ముందు రాత్రే సుబ్బమ్మ ప్రెసిడెంటుతో సుబ్రమణ్యం గురించి (మంచి మినహా) అంతా చెప్పేసింది. ఐదు నిమిషాలు –" కేవలం ముష్టయిదు నిమిషాలు" ఆలస్యంగా వచ్చిన

కాంపౌండరుకు అతను వార్నింగిచ్చిన వైనం– తోటే వాడు "ఎవుడూ? మన గురివిగాడు" ఏదో మామూలు ప్రకారం పస్టు తారీఖున ఓ సుక్కేసుకుంటే, అతనికి డిస్మిసల్ చార్జీ యిచ్చిన తీరూ, (అవ్వ! అదేనా ఫస్టుతారీఖున) అంతా చెప్పేసింది. ఇదంతా విన్న ప్రెసిడెంటు ఆమె ఆశించినంత బాధపళ్లేదు. ఆమె అనుకున్న ప్రకారం అతను నోట్లో చుట్ట ఉమ్మేసి, జుట్టు పీకేసుకొని, సుబ్రమణ్యం అంతు తేలుస్తానని ఓ వెర్రిశపథం పట్టి జీపెక్కి వెళ్ళిపోలేదు.

ఏవీఁ పనిచెయ్యకపోతే ఇంద్రుడు వజ్రాయుధం, అర్జునుడు గాండీవం, నువ్వు చెప్పూ తీస్తారు. కాని సుబ్బమ్మేదీ తియ్యదు. ఆమె ప్రెసిడెంటువేపు చూడవలసిన రీతిగా చూసి. చూపు కిటికీ లోంచి యిళ్ళ కెళ్ళి పోతున్న గేదెలవేపు జాలిగాసారించి, "ఎన్నైనా భరించొచ్చుగానీండిబాబూ, ఒంటరిగా వున్నప్పుడు ఆయన చూసే చూపు" చివరిగేదె తోక తెగిపోయింది. ఆమె మాటల్లోని దేషులు ప్రెసిడెంటు పూర్తి చేసుకున్నాడు. ఆమె చెప్పిందానికంటే చెప్పందే భయంకరంగా ఉందతనికి.

ఎన్ని కేరట్ల బంగారప్పళ్ళానికైనా ఓ చిన్న పిట్టగోడ చేర్పున్నా కావాలని సుబ్బమ్మకు బాగా తెలుసు ఈ కేరట్లూ, (కేబేజీల సంగతి ప్రెసిడెంటు కేఁవీఁ తెలీదు. అతనికి తెలిసిందల్లా సుబ్బమ్మ, పేరుని చూచి మోసపోకూడదు. సుబ్బమ్మ బావుం టుంది, చాలా బావుంటుంది. జలపాతం దగ్గర ఏర్పడ్డ తుంపర మేఘంలో విరిగిన యింద్రధనుస్సులా.... ముకుళించ బోతున్న కలువలో చిక్కుకున్న ఇందుకిరణంలా నీకు నచ్చిన పిల్ల నవ్వులా ఆకర్షణీయంగా వుంటుంది) చేతిలో తోవఁని యిత్తడి పళ్ళెంలాగా బంగారప్పళ్ళెం కూడా వుంటుందని, ప్రెసిడెంటుకి సుబ్బమ్మంటే యిష్టం. తనకి తనకున్న పదెకరాలూ రాసిచ్చేసిన పెళ్ళాంకంటే, తన్ని జైల్నించి తప్పించిన ప్లీడరుగారికంటే పరిశాత్ చైర్మన్‌గారి కంటే అతనికి సుబ్బమ్మంటే ఎక్కువిష్టం, అతని కిష్టంలేందల్లా సుబ్బమ్మవేపు ఎవరేనా "అదోలా" గాని, మరింకెలాగాని చూడ్డం. ఈ చూసే వాళ్ళని అధమం చూపుల్తోనైనా కాల్చేస్తాడు.

❖ ❖ ❖

అదంతా నిన్న రాత్రి. ఇప్పుడు ఆస్పత్రిస్టేపు కష్టాలన్నీ సానుభూతితో విన్నాడు ప్రెసిడెంటు. విన్నాక ఎడం కనుబొమ్మ మన్మధబాణంలా మనోహరంగా మీదకువంచి, పళ్ళనే కన్వేయల్ బెల్టులా ఉపయోగించి, నోట్లో ఉత్తరం చివర్నున్న చుట్టని దక్షిణం చివరకు తెచ్చి, కుడికన్ను చిన్నది చేసి, వీథిలో ఎంగిలాకుకోసం పరిగెత్తిన పందిని వెంట తరుముతున్న గజ్జికుక్క వేపు చూసి, "ఆపరేషన్లేవేనాచేశేడా" అని వేదాంతిలా జనాంతికంగా అడిగేడు.

"చేసేరు" అని కాంపౌదరు క్షణం వూరుకొని;

"ఒక హైడ్రాసిలూ, ఒక ఎమర్జెన్సీ" అని కలిపేడు, ఒక భ్రూణ హత్యా, శిశుహత్యా అన్నట్టు ధ్వనింపచేస్తూ.

"ఏదైనా ఫెయిలైందా?" వేదాంతి శోధిస్తూనే వున్నాడు.

"లేదు"

"ఆపరేషన్లో దబ్బేవైఁనా కతికేడా?"

"లేదు"

ఆపరేషన్లో సుబ్రమణ్య డబ్బు పుచ్చుకోలేదంటే, పేషెంట్లు రక్తం కళ్ళచూడ్డం అతనికి సరదానో, హాబీయో అనుకున్నాడు ప్రెసిడెంటు, కాని యిదేవిఁటి? మిగతా కేసుల్లో కూడా డబ్బు పుచ్చుకోకపోవడమేమిఁటి?

"పెద్దవాళ్ళ కేసులేవైనా చేశేడా?"

"బొల్లి రాజుగారి తమ్ముడి టైఫాయిడ్ కేసు చేశాడు. ఎంత బలవంతం చేసినా కాణీ పుచ్చులోలేదంటున్నాడు రాజు గారు."

"సరి దానికేంలే" అన్నాడు ప్రెసిడెంటు. బొల్లి రాజు గారి కల్లమాటల కేంలే అన్నట్టు.

ముప్ఫై ఐదేళ్ళున్న ప్రెసిడెంటుకి డెబ్భైయేళ్ళను భవం వుంది. అతను మూడుసార్లు పంచాయితీ ప్రెసిడెంటూ యిప్పుడు సమితి ప్రెసిడెంటయ్యేడు. అతని మీదొచ్చిన ఖూనీ కేసిదివరకే కొట్టే సేరు. అతని సివిలప్పీళ్ళు రెండూ హైకోర్టులో పెండింగా వున్నాయి. పెళ్ళానికున్న పదెకరాలూ తన పెరేనాడో రాయించేసుకున్నాడు. అనుభవశాలి కనుక అతను తొందరపడి హాస్పిటల్ స్టేపుకి మాటి వ్వలేదు. ఇది వరకున్న మంత్రసాన్ని యిద్దరెలిమెంటరీ స్కూలు టీచర్లనీ అతను ట్రాన్సఫర్చేయించేడు, కాని డాక్టర్ని ట్రాన్సఫర్చే యించడం అంత తేలిక్కాదు. దానికి ఎవరికాళ్ళు పట్టుకోవాలో కూడా అతనికి తెలీదు. (సుబ్బమ్మ కాళ్ళు తెల్లగా, మెత్తగా వుంటాయి) 'సరే మీరుపోయి మీ పనులు చూసుకోండి" అని లేచేడతను.

❖ ❖ ❖

సుబ్రమణ్యం పేదరికం, దరిద్రం, ఆకలీ అంటే తెలీకుండా సిటీలో పెరగేడు. అతన్నాన్నకి దుమ్ములు పిండాడేసే ఒక మిల్లు పూర్తిగానూ, మరో మూడు మిల్లుల్లో లావుగా షేర్లూ వున్నాయి.

సిటీలో కూడా బీదవాళ్ళూ, ముష్టివాళ్ళూ సుబ్రమణ్యం కళ్ళ బడ్డా అతను వాళ్ళ గురించి ఎప్పుడూ పట్టించుకోలేదు. రాకూడని మొన్నటి పీడకలల్లా వాళ్ళని మరచిపోయే వాడు. ఈ యుగానికి సంబంధించకుండా ఏదో పాత యుగాల పాపాలకి మచ్చల్లా మిగిలిపోయిన వాళ్ళు యెన్నడూ అతన్ని ఏ విధంగానూ బాధపెట్టలేక పోయేరు.

అతను డాక్టరయ్యేక, సుల్తాన్‌పురం, సువర్ణ పట్టణాలు వెయ్యలేదతన్ని గవర్నమెంటు కసున్నట్టు అతన్ని ఐదారేళ్ళు చిన్న వూళ్ళూ, ప్రైమరీహెల్తు సెంటర్లే వేసింది. ఆ వూళ్ళల్లోనే అతను, ప్రతికనిపించిన తన మంచితనాన్ని అగ్గిలా దహించే ప్రజల ఆకల్నీ, మనుషుల్లోని మానవత్వాన్ని కూకటివేళ్ళతో పెల్లగించే దరిద్రాన్నీ, పెనుమేఘాల్లా ప్రజల్ని చుట్టేసిన అజ్ఞానాన్ని క్లోజప్పులో చూడగలిగేడు.

"విరిగిన ఎముకల గూళ్ళకి చర్మం తొడిగిన ప్రాణం లేని బొమ్మల్లావున్న వీళ్ళు నా ప్రజ?" అని విస్తుబోయేడు, "స్మశానం సన్న బూడిదలాంటి బుగ్గిలో మునిగిపోయిన యీ పల్లెలా నాదేశం?" అని విచారిం చేడు. ఏముందిక్కడ? ఇక్కడ సగం మందికి ఏ కోరికా వున్నట్టులేదు! సగంమంది చచ్చినట్లున్నారు. మిగతా సగం పూర్తిగా చచ్చినట్టున్నారు. సగం మందీ సంతుష్టిగా భోంచేసి ఎన్నాళ్ళో ఐనట్టుంది. మిగతా సగంమందీ యింకెప్పుడూ కడుపునిండా తిండి దొరకదన్న నిరాశతో వున్నట్టున్నారు. ఇక్కడ ప్రజలకి మనుషుల కుండవలసిన ఆశలుగాని, ఆవేశాలుగాని వున్నట్టులేవు. ఎందుకు బ్రతుకుతున్నారో తెలీక చావలేక బతుకుతున్నట్లున్నారు.

ఏదో వూరెళ్ళిన కొత్తలో ఒకనాడు సుబ్రమణ్యం షికారెళ్ళేడు. పొలం బురదలో, నిలబడ్డానికి శక్తిలేని ఒక ముసల్ది కూర్చొని పనిచేస్తోంది. చచ్చిపోయిన మర్రితాలూకు భూమ్మీదకు తేలిన వేళ్ళల్లా వున్నాయి ఆమె బురద పట్టిన అవయవాలు. మసిబారిన గాజు చిమ్నీలా వున్నా యామెకళ్ళు. తల్లిరొమ్ము వదిలేక ఆమె కడుపెప్పుడూ నిండుండదు. వచ్చే జన్మలో నిండాలన్న కోరిక్కూడా ఆమె కున్నట్టులేదు. ఆమె కట్టుకున్న– పంచో– చీరో ఏ రంగుదో తెలీదు. ఆమెకు రవిక లేదు. రవిక అవసరం కూడా లేదు. దగ్గర కొచ్చే వరకూ ఆడో, మగో తెలీదు. దూరాన్నుండి చూస్తే మనిషి లాగేలేదు. మట్టిలో పుట్టిన ఏ పెను పురుగులాగో వుంది. ఆమె ఏం చేస్తోందో సుబ్రమణ్యాని కర్థం కాలేదు. ఉరికంబ మెక్కుతున్న నేరస్తుళ్ళా "వేగిరం వేగిరం" అంటూ చావుని కోరుకుంటున్నట్లుంది. తనక్కావలసిన "ఆరడుగుల స్థలం" కోసం వెదుక్కుంటున్నట్టు బురదంతా చేతుల్తో కలుపుతోంది. పలకరిద్దామని దగ్గర కెళ్ళేడు సుబ్రమణ్యం. నాలుగు వెర్రికుక్కలు ఒక్కసారి వెంటబడ్డ పసిపిల్లలా చైతన్య రహితంగా వుండిపోయి అతిభయంగా అతని వేపు చూసింది. పలకరించకుండా వెళ్ళిపోయేడు సుబ్రమణ్యం.

"ఇక్కడ మనుషులు మనుషుల్లా లేరు. పశువుల్లా కూడా లేరు. ఈ ఆకలీ, అజ్ఞానం, రోగాలూ పోవాలి. మనుషులు దేవుడు పుట్టించిన మనుషుల్లా వుండాలి. మనుషులు చేసిన కుక్కల్లా వుండకూడదు. వీళ్ళనిలా చేసే పరిస్థితులు ఏవైనా సరే, అవి మారిపోవాలి" అని కొన్నాళ్ళయ్యేక సుబ్రమణ్యం అనడం ప్రారంభించేడు.

ఏమిచూచుకు బతుకుతున్నారీ దరిద్రులు? మనిషీ, దేవుఁడూ వీళ్ళకిచ్చే ఆశ ఏఁవిఁటి? ప్రతి ఎలక్షనుకి బందుల్దొడ్డికి పశువుల్ని తోలుకెళ్ళినట్టు వీళ్ళని అన్ని పార్టీలవాళ్ళు తోలుకెళ్తూనే వున్నారు. ఇన్ని ఎలక్షనులయ్యేయి. ఇంత మంది కొత్తనాయకులొచ్చేరు. గాంధీలు ప్రాణాలిచ్చేశారు. నెహ్రూలు చచ్చేట్టు పన్చేశారు.

సెగలూ, పొగలూ, కక్కుతున్న భూమిలోంచి పుట్టుకొచ్చిన కొత్త రాక్షసుల్లా యెన్నో ఫేక్టరీలొచ్చేయి. మహానదుల్ని మడిచి కట్టేసేరు. దేశాన్ని ఇనుపకమ్ముల్తో బంధించినట్టు యెన్నో కొత్త యినుపదార్లు వేశారు. దేశాన్ని కొత్త ముక్కలుగా కోశారు. కొత్తగోళాలు వదిలేరు. పాతగోళాల్ని జండాకొయ్యల్తో పొడిచేరు.

బొంబాయిలోని ఫేక్టరీ మేనేజరు బోస్టన్‌లోని తన అమెరికన్ ప్రియురాల్తో మాట్లాడ్డానికి మూణ్నిముషాలు పట్టదు. ఈవేళ లండన్లో కుట్టిన కొత్తసూటు రేపు లక్నోలో తొడుక్కోవచ్చు. ఈవేళ పేరిస్‌లో వచ్చిన కొత్త ఫ్రాకు పేరిస్లోలేనని పాట్నాలో బాధపడే పెద్దింటి పిల్ల యీ వేళా తొడుక్కోవచ్చు. గొప్పవాళ్ళక్కావలసిన సినీమాలూ, సిగరెట్లూ చెయ్యడానికి ప్రపంచమంతా బాధపడుతూనే వుంది. కానీ యీ బీదవాళ్ళ, "యీ ముష్టి వెధవల" పరిస్థితి మారదేం?

ఇక్కడ కాలేజీలున్నాయి. కాని వీళ్ళకి అక్షర ముక్కరాదు. ఇక్కడ భూములు బంగారంపండుతాయి. వీళ్ళకి తిండే బంగారమైపోయింది. ఇక్కడ టెర్లిన్మిల్లు లున్నాయి. కాని వీళ్ళకి చినిగిన

గుడ్డలైనా మనిషికి రెండుండవు. ఇక్కడ మందుల కంపెనీలు న్నాయి. వీళ్ళకి జబ్బులూ వున్నాయి. కాని వీళ్ళ జబ్బులకి మందులు దొరకవు.

ఇలా మాట్లాడే సుబ్రమణ్యాన్ని అయిష్టు యాయిష్టు అన్నారు.

❖ ❖ ❖

స్మశానంలో నక్కలు పసిపిల్లల గోరీలు తవ్వేవేళ గూబలు బంగారు పిచ్చికల గొంతులు కొరికేవేళ– నిద్రకళ్ళతోనే ఆస్పత్రి చేరుకున్నాడు సుబ్రమణ్యం. రెండు కొట్టి చాలాసేపైంది.

"బండీ, కారూ గుద్దుకున్నాయి. సార్" అపరాధం చేసిన ట్టంది నర్స్.

వరండాలో నేలమీద వళ్ళల్లా దెబ్బల్తో, వాట్నించి స్రవించే ఎర్ర రక్తంలో కిలకిల కొట్టుకుంటున్న పురుగుల్లా పడున్న యిద్దరు యువకులు కన్పించేరతనికి వాళ్ళ వయసులు పాతిక్కిపైనా, ముఫ్ఫైకిలోపై వుండొచ్చు. బైటిక్కనిపించే ఎక్స్టెరనల్ యింజరీస్ (external injuries) ఆశల్నితుంచేస్తూ భయంకరంగా వున్నాయి. బతికుండగానే నక్కలు కొరికేసినట్టూ, రాబందులు పీకేసినట్టూ వున్నారు వాళ్ళు.

వాళ్ళన్చూడగానే తను అడుగు వెయ్యబోయిన చోట భూమి పగిలిపోయినట్టూ, తను పెంచుకున్న ఆశ తన్ని వెక్కిరిస్తున్నట్టూ ఫీలయ్యేడు సుబ్రమణ్యం. క్షణకాలం ప్రస్తుతాన్ని తన కళ్ళనుండి చెరిపేస్తున్నట్లు కళ్ళకి చెయ్యి అడ్డం పెట్టుకున్నాడు. వాళ్ళన్చూడగానే తెలుసతనికి వాళ్ళిద్దరికీ వెంటనే ఆపరేషన్ చెయ్యాలనీ, ఏ ఒక్కడూ రెండోవాడి ఆపరేషనయ్యేవరకూ బతకడనీ.

ఎవరికి ముందాపరేషన్చెయ్యడం– నిజాన్ని గుర్తించాలంటే ఎవర్ని ఆపరేషన్చెయ్యకుండా చంపెయ్యడం? ఎవరి భార్య నుదుటికుంకుమ తనచేత్తో నిర్దయగా చెరిపెయ్యడం? ఎవరి తల్లి కడుపులో నిప్పులకత్తి గుచ్చడం? ఎవరి పసిపిల్ల పువ్వు లాంటి చేతిలోని, పాలగిన్నె రాక్షసంగా తన కాలితో తన్నెయ్యడం?

నీకు ఎవరో ఒకర్నే రక్షించడానికి శక్తుంటే ఎవర్ని రక్షిస్తావు? కనిపెంచిన తల్లినా? ప్రేమించి పెంచిన భార్యనా? నీతోబాటు నీ తల్లికడుపు చీల్చుకొచ్చిన నీ తమ్ముణ్ణా? నీ కోసం పొట్ట చీల్చు కోమన్నా చీల్చుకొనే నీ స్నేహితుణ్ణా? నీ ముసలితనంలో అందొచ్చే నీ కొడుకునా? ముష్టెత్తికుష్ఠు తల్లిని పోషించే బీద పిల్లణ్ణా? నీకు తెలియని ధనికుణ్ణా నిన్ను తెలియని బీదవాణ్ణా? ఎవర్ని? ఎవర్ని నువ్వు రక్షిస్తావు? ఎవర్ని రక్షించాలి?

ఘోర సమస్య పళ్ళచక్రాలమధ్య తెగిపోతున్న మనసుతో వెనక్కి చూసేడు సుబ్రమణ్యం.

పెళ్ళిపారాణి పూర్తిగా ఆరకుండానే భర్తను పోగొట్టుకున్న పెళ్ళికూతురు తన వణుకుతున్న వేళ్ళతో చెరిపేసుకోగా మిగిలిన బొట్టుముక్కలా కాంతిలేని ఎర్రని చంద్రుడు లేచాడు.

దగ్గరకొస్తే తన పాశాల్తో బంధించి తినేస్తానని బెదరించే గుడ్డి రాక్షసుళ్ళా వున్న ముసలిమర్రి మింగేసిన చీకట్లో, పిశాచ లిపితో జోస్యం రాస్తున్నాయి మిణుగురు పురుగులు.

నక్కలు సగం తిని వదిలేసిన పెద్దజంతువుల కళేబరాల్లా వున్నాయి. ఆస్పత్రి ప్రక్కన సగం కమ్ములూడిపోయిన పూరి గుడిసెలు.

వరండాలో రక్తం చీకట్లో పాకిన పాము చీలికనాలుకలా సుబ్రమణ్యం కాలికి తగిలింది.

ఉలిక్కిపడ్డాడు సుబ్రమణ్యం.

'థియేటర్రెడీ చెయ్యండి– అన్నట్టు పోలీసు రిపోర్టు కూడా పంపండి" అన్నాడతను. ఆ స్మశాన నిశ్శబ్దంలాంటి నిశ్శబ్దంలో తన కంఠం తనకే మోటుగా వినిప్పించింది.

దెబ్బల్తగిలిన వాళ్ళిద్దరూ జీవితంలోని సాంఘిక తారతమ్యాల చిహ్నాల్లో వున్నారు. చచ్చినా టెర్లిన్బట్టల్లోనే చస్తానన్నట్టున్నా డొకడు. రెండోవాడి పంచెక్కడ చిరిగిందో, ఎక్కడ చిరగలేదో తెలీకుండా రక్తంలో తడిసిపోయి వుంది. ఒకడి కిస్కర్లు (Kiss curl) రక్తంతో నుదుటికి అంటుకుపోయి విద్యుద్దీప కాంతిలో మెరుస్తోంది. రక్తంలో తడిసిన రెండో వాడి తుప్పుజుత్తు తారులో తడిసిన గడ్డిలా దల్గా వుంది. ఇద్దరూ చావుకి చేతికందే దూరం లోనే వున్నారు. కాని చావులో కూడా ఎంతతేడా వాళ్ళ మధ్య? ఒకడు "ది డైయింగ్ ప్రిన్స్" (The dying Prince) లా వున్నాడు రెండో వాడు "ది డెడ్ బెగర్" (The dead beggar) లా వున్నాడు కాని యిద్దరూ గొణిగే మాటల్లోని భాష ఒకేరకంగా భయంకరంగా వుంది.

సుబ్రమణ్యం యిద్దర్నీ పరీక్షించేడు. ఇద్దరికీ చిన్న దెబ్బలు చాలా వున్నాయి. గొప్పవాడి కడుపుమీద పెద్ద దెబ్బ తగిలి స్ప్లీన్ గాయపడింది. బండివాడి కుడికాలు మోకాలుమీద పెద్ద పెద్ద దెబ్బుంది. రమారమి కాలు పూర్తిగా తెగిపోయినట్టుంది. కాలు వెనక్కి మడచి పరీక్ష చేస్తున్నప్పుడు గాయం పూర్తిగా విడి, అప్పుడే మేక పిల్ల రక్తంతాగి తృప్తిగా ఆవులించిన పులి నోర్లావుంది.

❖ ❖ ❖

తనగదిలోకి పోయి ఆపరేషన్ డ్రెస్సు వేసుకున్నాడు సుబ్రమణ్యం. డ్రెస్సు కళ్ళూ చేతులు తప్ప వళ్ళంతా కప్పేసింది. ఆ డ్రెస్సు అతను రోజూ వేసుకునేదే కాని ఆవేళ తన మట్టుకు తనకి మనిషి పోలికలు కన్పించలేదతనికి.

"థియేటర్రెడీ ఐందిసార్. ఎవర్ని తీసుకురమ్మంటారు?" గదిలోకి వచ్చి అడిగింది నర్స్.

"ఆ కారతన్ని తీసుకరండి" అన్నాడు సుబ్రమణ్యం అదివరకే ఒక నిర్ణయానికొచ్చినవాళ్ళా.

ఆపరేషను మొదలైంది.

తెగుతూన్న మనిషి కడుపుమీద ఆపరేషన్కత్తి చేసే పైశాచిక విన్యాసాలు, చనిపోయిన వాడికళ్ళలా తేజోవిహీనంగా పగిలిన కిటికీ అద్దంలోంచి కనిపించే రెండు నక్షత్రాలూ నీడల్లేని ఆపరేషన్ లైట్ల అసహజకాంతి– నిర్భయంగా కాలాన్ని తోడుతున్న గడియారపు సమ్మెట దెబ్బలూ– జుట్టు విరబోసుకున్న దరిద్ర దేవతలా వున్న తుమ్మచెట్టూ– దూది మెత్తదనాన్ని భయంకరంగానూ, అసహజంగానూ పెంచే మానవరక్తం ఎరుపూ– రాక్షసుల కళ్ళకాంతిలా మెరిసే ఆపరేషను వంకర కత్తులూ– చెమటా, రక్తం కలిసిన అసహజ ద్రవం యూనిఫారమ్మీద వేసే మరకలూ– క్షీణిస్తున్న ఆశలా తగ్గిపోతున్న పేషెంట్ బ్లడ్ ప్రెషరూ– కాంతిని మింగే గోడలరంగూ చీకట్లో చేతికి దొరకని చావుతో ఉజ్జీలేని యుద్ధం– మనుషుల మంచితనానికి నిదర్శనంగా మిగులుతున్న "ఈ పేషెంటుని బతికించాల"ని నిశ్శబ్దంగా నలుగురు చేసే పనుల ఐకమత్యం– గుర్తున్నాయి సుబ్రమణ్యానికి ఆపరేషను ముగించేలోగా.

ఆఖరు కుట్టు వేసినప్పుడు పేషెంటు బతుకుతాడన్న ఆశ కలిగి ఒక అడుగు వెనక్కి వేశేడు సుబ్రమణ్యం. పునర్జన్మెత్తినట్టున్న పేషెంటుపై తన పనితనం తృప్తి  నిచ్చింది.

ఎవరో థియేటరు తలుపు తీసేరు. కన్నతల్లి ప్రేమలా చల్లగాలి అతన్ని కౌగలించుకుంది. చెమటకి తడిసిన ముసలి నర్సు నుదుటిపై కుంకుమబొట్టు అప్పుడే ఉదయించిన చంద్రుళ్ళా, వుండవలసిన దానికంటే అందంగా, పెద్దగా మంచివాని మనసులా నిండుగా కనిపించింది. మొదట సిగ్గుపడి ఎర్రనై, సిగ్గుపడినందుకు యింకా సిగ్గుపడి నల్లవైన పెళ్ళి కూతురి చెక్కిల్లా వుంది తూర్పాకాశం చల్లగాలికి ప్రియుడి వొళ్ళోంచిలేచి వళ్ళు విరుచుకుంటూ వడలంతా కదిలించిన ప్రియురాల్లా కాంపౌండులోని మొక్కలు జలజల్లాడేయి. సుబ్రమణ్యం చేతినుండి జారిన నీటిబొట్టు వాష్ చేసిన అంచను పరిగెత్తి నిలిచి అప్సరస ముక్కు పుడకలోని వింత వజ్రంలా ఎలక్ట్రిక్లైట్ల కాంతిలో మెరిసింది. చేతులెత్తుకొని సుబ్రమణ్యం తడి తువ్వాలు నర్సుకిస్తున్నప్పుడు, సన్నని పైటలోంచి ఫలించని ఆశయంలా ఆమె మంగళసూత్రం అతని కళ్ళలో మెరిసింది.

పేషెంటుని స్ట్రెచ్చర్మీద తీసుకుపోయేరు. "బండతన్ని తీసుకు రండి" అన్నాడు సుబ్రమణ్యం. బైటకు వెళ్ళిన నర్సు వెంటనే వచ్చేసింది. "అవసరం లేదు" అంది అపరాధిలా.

బండతను ఆపరేషన్లూ, ఔషధాలూ లేనిచోటికి వెళ్ళిపోయేడు. ఎక్కడికో? ఎక్కడికైనా సరే– ఈ నరాన్నికొరకే ఆకలి– హృదయాన్ని నిప్పుల పిడికిలితో పొడిచే బాధా – ఈ లక్షల మధ్యున్న భయంకరమైన ఒంటరితనం– లేని చోటుకి వెళ్ళిపోయేడు.

బేసిన్ నున్నటి అంచునున్న నీటివజ్రం కలక్క కలక్క కలిగిన ఒక్క కొడుకునీ పోగొట్టుకున్న తల్లి కన్నీటి బొట్టులా నేలరాలి బద్దలైంది.

దించిన తలతో, తన నిర్ణయం న్యాయమైనదేనా అన్న సందేహం నరనరాల్ని నిలువునా చీలుస్తుంటే, తనలో తనకే తగ్గిపోతున్న నమ్మకంతో యిల్లుచేరి పక్కమీద ఓడిపోయిన సైనికుళ్ళా వాలిపోయేడు సుబ్రమణ్యం. కాని అతను నిద్రకి దూరమైపోయేడు.

❖ ❖ ❖

ఉదయమే ఆస్పత్రికి బైల్దేరేడు సుబ్రమణ్యం. గత రాత్రి ప్రమాదం ఆస్పత్రికి దగ్గరే జరిగినట్లుంది. బండిఎద్దుల్లో ఒకటి చచ్చిపోయింది. చావనిది చచ్చినదాని కోసం ఒకటి తన పగిలిన ఒంటి కంటితో రక్తం ఏడుస్తోంది ఆ దృశ్యాన్నుంచి దృష్టి మరల్చి ఆస్పత్రికి చేరేడు సుబ్రమణ్యం.

అతను సాధారణంగా టైముకి వస్తేనే యమభటుళ్ళా కనిపిస్తాడు తన స్టేపుకి. ఈవేళ అరగంట ముందు రావటం చేత యమభటుణ్ణించి యముడి ప్రొమోష నొచ్చినట్టున్నాడు.

త్వరగా పనిముగించి పోస్టుమార్టమ్ చేసి యింటికిపోయి నిద్ర పోయాడు.

సాయంత్రం నాలుగ్గంటలకి కళ్ళువిప్పిన సుబ్రమణ్యం ఎదురుగా కుర్చీలోనున్న తన భార్యని చూసి ఆశ్చర్యపోయేడు.

ఆమె రావలసింది ఆ మర్నాడు. ఐదునిమషాల్లో సంభాషణ ముందురాత్రి చేసిన ఆపరేషన్మీదికి పోయింది.

"బండివాడికి ముందాపరేషన్చెయ్యలేదేం? ఏఁవైంయ్యేయి మీ ప్రిన్సిపల్? బీదవాళ్ళంటే దయంటారే? పేద వాళ్ళంటే ప్రేమంటారే? ఏఁవఁయ్యేయ్ ఆ ప్రేమా దయాను? అంతేలెండి? ఈ మాటలన్నీ సమస్యరానంతసేపే! ఒక ధనికుణ్ణిగాని, ఒక ముష్టి వెధవనిగాని రక్షించుకో– అని భగవంతుడన్నప్పుడు మీ రెవర్ని కాపాడేరు? అంతకంటే సూటిగా అడగాలంటే ఎవరి ప్రాణం తీసేరు? ఓ బీదవాడిది. ముష్టి వెధవది. ఛస్తే ఏడ్చేవాళ్ళే లేని ఒక దరిద్రుడిది!" అని భార్య అంటుందేమోనని భయ పడ్డాడు సుబ్రమణ్యం. కాని ఆమె అలా అన్లేదు. "బండివాడికి ముందు చెయ్యలేదేం ఆపరేషనూ?" అని మృదువుగా అడిగింది.

"నేన్చేసింది తప్పో ఒప్పో భగవంతుడికే తెలుసు యశోదా. నువ్వూ డాక్టరువే. నీకు తెలుసు నా హేండీకేప్ (Handicap). ఇది చిన్నాస్పత్రి. మరో డాక్టరు సాయం కూడా లేదు. ఎనిస్తే సియా నేనేయిచ్చుకోవాలి. బ్లడ్ ప్రెషరూ నేనే చూసుకోవాలి. ఇద్దర్లో ఎవరికి ఆపరేషన్చేసినా చాలా టైము పడుతుంది. అంత వరకూ రెండోవాడు బతకడు. ఎవరికి ఆపరేషన్చెయ్యాలా అని బాగా ఆలోచించడాని క్కూడా టైములేదు.

ఇద్దర్దీ ఒకటే వయసు. ఇద్దరికీ పెళ్ళిళ్ళయి వుండాలి. ఒకరో, ఇద్దరో పిల్లలు యిద్దరికీ వుండొచ్చు.

కారతను ఏ గవర్నమెంటాఫీసరో, కంపెనీ వుద్యోగో అయ్యుండాలి. అతను పోతే అతని భార్యాబిడ్డల గతేంకాను? వాళ్ళకి నిలువ నీడకూడా లేకపోవచ్చు. ఇక బండతనున్నా లేక పోయినా అతని పెళ్ళాం పిల్లల గతొక్కటే. వాడున్నా వాళ్ళొక్క రోజుకూడా పనిమానుకోలేరు. వాడులేక పోయినా వాళ్ళు బహుశా ఎక్కువ కష్టపడనక్కర లేకపోవచ్చు మరో ఆలోచన– పాడాలోచనే అను. కారతనుపోతే అతని భార్య మళ్ళీ పెళ్ళిచేసు కోలేకపోవచ్చు. ఆ అవకాశం లేకపోవచ్చు. బండివాని పెళ్ళాని కా అవకాశం వుండొచ్చు.

నిముషాలమీద నిర్ణయానికి రావలిసొచ్చింది. వచ్చేను. ఇంతకుమించి నేను చెప్పవలసిందేం లేదు."

అతని బాధ నర్థంచేసుకోగలశక్తీ, సానుభూతీ ఆమెకున్నాయ్.

❖ ❖ ❖

ఆ సాయంత్రం ఆరవుతూంటే పడవలాంటి ఎర్రకారు గుమ్మలో ఆగడం చూసి ఆశ్చర్యపోయేరు యశోదా, సుబ్ర మణ్యం. అందులోంచి పాతస్నేహితుడు డాక్టరు సిరాజుద్దీన్ దిగడం చూసి యింకా ఆశ్చర్యపోయేరు.

"ఎలా వున్నాడు మా చంద్రశేఖరం? మీ చేతుల్లో పడ్డాక ఎలా వున్నాడని అడగక్కర్లేదనుకోండి" అంటూ లోపలికి ప్రవే శించేడు సిరాజ్.

చంద్రశేఖర మెవఁరో తెలీదు సుబ్రమణ్యానికి. కాని సిరాజ్ చెప్తే అంతా అర్థమైపోయింది. నిన్నరాత్రి తాను ఆపరేషను చేసిన కారతను చంద్రశేఖరం, అతన్దీ సిరాజ్వూరే. సిరాజ్కి ముఖ్య స్నేహితుడు కూడానట. ఎడ్వకేటూ, పిల్ల జమీన్దారూనట.

పాతస్నేహితులు పాతకబుర్లు చెప్పుకుంటున్నప్ప టికీ, చంద్రశేఖరం భార్యాబిడ్డలూ రానందుకు లోపల్లోపల బాధపడు తూనే వున్నాడు సుబ్రమణ్యం.

"మీ ఫ్రెండుకి తల్లీ దండ్రీ ఎవరూ లేరూ?"

"వాళ్ళు చెల్లిపోయి చాన్నాళ్ళయింది."

"మరి భార్యా పిల్లలూ?"

"ఉన్నా లేనట్టే"

"ఇంకా పెళ్ళి కాలేదా?" ప్రశ్నలోని ఆశ్చర్యాన్ని సాధ్యమైనంత వరకూ కనపణ్నివ్వకుండా అడిగేడు, సుబ్రమణ్యం.

"అదక్కు భాయ్! అదంతా ఒక పెద్ద ట్రాజెడీ మూడేళ్ళు ప్రేమించి రెండేళ్ళక్రిందట పెళ్ళిచేసుకున్నాడు శేఖరం. క్లబ్బులూ, పార్టీలూ, పిక్నిక్కులతో అంతారెండేళ్ళు సమంగానే గడిచి పోయింది. తర్వాత ప్రారంభమయ్యేయి కీచులాటలు. చంద్ర శేఖరం బెస్టుఫ్రెండుతో ఆమెగారు వారం కింద లేచిపోయింది. కొసకీ శేఖరం గుడ్డిగా ప్రేమిస్తూనే వున్నాడు ఇదిగో ఈ వుత్తరం చూడు. నిన్న యిది నాకు రాసి గైర్హాజరై పోయేడు" అంటూ సిరాజ్ సుబ్రమణ్యంకుత్తరా న్నందించేడు.

"మైడియర్ సిరాజ్! (My dear Siraj)

నీకు ఎంతో పెద్ద ఉత్తరం రాయాలనీ, నా బాధంతా నీతో చెప్పుకోవాలనీ వుంది. కాని యిప్పుడు నేనేం రాసినా ప్రయో జనం లేదు.

ఉన్న ఊళ్ళో తలెత్తుకు తిరగలేను. పరాయిచోట కూడా బతకాలన్లేదు. నా దృష్టిలో నేను చచ్చిపోయిన బొద్దింక కంటే

కూడా జుగుప్సాకరంగా కన్పిస్తున్నాను. జీవితమంటే మోజు పోయింది. నాకు చచ్చిపోవాలనే వుంది. ఏ నిశ్చయానికి రాలేక పోతున్నాను. ఏ ప్రమాదంలోనైనా మరణిస్తే బావుండునని పిస్తోంది. ప్రస్తుతం ఎక్కడికి వెళ్ళేదీ, ఏం చేసేదీ నాకే తెలీదు. జీవించ నిశ్చయించుకుంటే కొద్ది నెలల్లోనే నిన్ను కలుస్తాను.

శలవ్,

నీ సోదరుడు,
చంద్రశేఖరం

ఉత్తరం చదువుకున్నాక సుబ్రమణ్యం; యశోదా ఒకరి కళ్ళల్లో కింకొకరు చూసుకున్నారు.

"రా, భాయ్ మా వాణ్ని చూసొద్దాం. వానొచ్చేట్టు కూడా వుంది" అంటూ సిరాజ్ లేచేడు. ముగ్గురూబైల్దేరేరే.

చంద్రశేఖరం నిద్రపోతూనే వున్నాడు. అతని– ఉచ్ఛ్వాస నిశ్వాసములు భారంగా వున్నాయి. అతనిగదిలోకి వెళ్ళగానే "బైయువర్ లీవ్) (by your leave) " అని సుబ్రమణ్యంతో అని సిరాజ్ చంద్రశేఖ రాన్ని ఎగ్జామిన్ చెయ్యనారంభించేడు. యశోదా, సుబ్రమణ్యం ఆతృతగా మంచం పక్కనే నిలబడ్డారు. పరీక్షచేస్తూనే "జనరల్ కండిషన్ చాలా బాగుంది" అన్నాడు సిరాజ్.

పరీక్ష పూర్తయేక సిరాజ్ ఒక అడుగు వెనక్కివేసి సుబ్రమణ్యం వేపు తిరిగి, కృతజ్ఞత కళ్ళల్లోనే చూపిస్తూ, "పూర్ ఫెలో! అదృష్ట వంతుడు, ఏం పర్వాలేకపోవచ్చు" అన్నాడు.

చంద్రశేఖరం గదిలోకి వెళ్ళినదగ్గర్నుండి సుబ్రమణ్యాన్నేదో నిర్వచించలేని వ్యధ పీడించసాగింది. తాను చెయ్యని తప్పేదో తనని వెక్కిరిస్తున్నట్లు, తనదికాని పాపమేదో తనని పరిహసి స్తున్నట్లు అతను బాధపడ సాగేడు. ఎందుకో అకస్మాత్తుగా చీకటీ వెలుగూకాని అసహజ కాంతిలో, నల్లగా కనిపించే తాజా రక్తంతో లారీకిందపడిన వీధికుక్కలా కదల్లేక కొట్టుకుంటూ, బాధ తట్టుకోలేక, ఓదార్చేవారులేక విలవిల్లాడిపోయిన బండీవాడి దృశ్యం అతని మెదడులో మెదిలింది. అతని మనస్సును తన పళ్ళచక్రాలతో తునకలుగా కోసేస్తున్న బాధకు అదృష్టవశాత్తు మిగతా యిద్దరూ దూరంగానే వున్నారు. కాని అతనిలోని మార్పుమాత్రం చూడగలిగారు.

వంచిన తలల్తోనే ఆస్పత్రిలోని సుబ్రమణ్యం గది చేరేరు ఆ ముగ్గురూ. సుబ్రమణ్యం లైట్ స్విచ్ వేసి మూసిన కిటికీ దగ్గరికి వెళ్ళాడు. గదిలో కాంతి బైట అంధకారంవల్ల యింకా ఎక్కువగా యిళ్ళు కాలిపోతున్నప్పటి వెలుగులా బైట పొరలు, పొరలుగా దళసరి చీకటి గదిని చుట్టేసి, మిగతా ప్రపంచంనుండి విడ దీస్తున్నది.

నల్లటి కిటికీ అద్దం మీద పడిన వానచినుకు నల్ల స్త్రీ చెంపమీద కన్నీరులా మెల్లగా జారింది.

కిటికీ తియ్యగానే చావులాంటి చల్లగాలి సుబ్రమణ్యాన్ని అదర్చింది. కంటికనిపించని భయంకర దృశ్యాలెన్నో అతడ్ని బాధపెట్టసాగేయి.

కొన్నిమైళ్ళ అంధకారం తర్వాత పోస్టుమార్టమ్‌షెడ్ దగ్గర ఏదో కదలిక– ఆకారంలేని వ్యక్తుల బరువైన చలనం– తిరగేసిన మంచం – నల్లటి నాలుగు జతల భుజాలు– చాపలొ చుట్టిన శవం– హృదయాన్ని పూర్తిగానింపి బైటకుపొంగే దుఃఖాన్ని వెనక్కుతోసే ఒక స్త్రీ నోట్లోని నల్లంచు చీరె చెంగూ– ఒక తల్లి చెంపను కాల్చేస్తూ కిందకు జారి నేల మీద బుగ్గిని పొగలా లేపిన కన్నీటిబొట్టూ– స్మశానంలో కాలుతున్న శవం తలపేలిన ధ్వని– చింతచెట్టు చివర్న మాంసమీద చర్మం లేనట్టున్న తన ఎర్రతలను ముందుకిచాపి ఎగరబోయిన రాబందు లోహపు రెక్కల కదలిక– ఏవేవో అతనికి కనిపించి వినిపించేయి.

పోస్టు మార్టమ్ షెడ్ దగ్గరున్న వాళ్ళు సుబ్రమణ్యం గదివేపే వస్తున్నారు. పది పదిహేను మందుండొచ్చు. సుబ్రమణ్యం కిటికీ వదిలి తన కుర్చీలో కూర్చున్నాడు.

కొన్ని క్షణాల్లో తోటీ వాడొచ్చి "ఆ బండతన్తల్లి తవఁరు గోరికి దణ్ణవెఁట్టి పోతానంటోంది బాబయ్య" అన్నాడు సుబ్ర మణ్యంతో.

మనిషి దేవుఁడికి చెయ్యవలసిన నమస్కారం ఆవిడ తనకి చెయ్యదల్చింది ఎందుకు? ఎందుకు? ఆమె కొడుకుని ఆపరేషన్చె య్యకుండా చచ్చిపోనిచ్చి నందుకా? తనేం చేశాడామెకు?

"సరే" అని కూడా అన్లేకపోయేడు సుబ్రమణ్యం. వాళ్ళు ముగ్గురూ చీకటిగావున్న వరండాలో కొచ్చేరు. భక్తితో కూడిన నిశ్శబ్దంతో వరండాలో చాలామంది నిలబడ్డారు. వాళ్ళమధ్య, కాట్లో ఒక కాలు పెట్టుకున్న ఒక ముసల్ది వుంది. ఆమె చచ్చి పోయినవాడి తల్లయుండాలి.

"గొప్పోళ్ళ మద్దెన" తన కడుపు కాలిపోతున్నా ఏడవ కూడ దని ఆమెకు తెలుసు. సభ్యతకు భంగం రాకుండా, తనో తల్లిననీ, తనకు మిగిలిన ఒక్క కొడుకూ చచ్చిపోయేడనీ, సాధ్యపడక పోయినా మర్చిపోడాని కామె అణువణువునా ప్రయత్నిస్తోంది.

కదలిపోయిన ఫోటోలా వుందామె ముఖం. ఏ ఫీచరూ స్పష్టంగా లేదు. ఆమె శరీరమంతా లోతుగా కోసుకుపోయినట్టు ముడతలుపడి, వేసవిలో ఎండి పగిలిన చెరువు గర్భంలావుంది. రెక్కలు కాలిన దీపప్పురుగులా అతి అసహ్యంగానూ, అతి దీనం గానూ వుందామె. తనకు అనుక్షణం కన్పిస్తున్న భయంకర చిత్రాన్నేదో చూడదల్చుకోలేనట్టు క్షణక్షణం మాత్రం కనురెప్పలు మూసుకుంటోందామె.

యశోదా, సిరాజ్‌లే పలుకరింపులూ, సానుభూతి వచనాలూ కావిస్తున్నారు. వాళ్ళ ప్రశ్నలకి మనిషో జవాబు చొప్పున చెప్తున్నారు వరండాలో వాళ్ళు. బూతులు మినహాయిస్తే వాళ్ళు చెప్పిన కథ!

బండతన్ది అక్కడికి దగ్గరేవున్న ఒకపల్లెట. బండే వాడి యావదాస్తీనట. అతనికంటే ముందుపుట్టిన "పంచిపాండవుల్లా టోళ్ళలో నలుగురు సిన్నప్పుడే సెల్లిపోనారు. కడకీడొక్కడే దరమరాజులాటోడు– మిగిలినాడు' అతని తండ్రిపోయి "మొన్న చివర్రేత్తిరికి ఏడో ఏట సొరబడ్డది" ఆ బండతనికి ముత్తేలమ్మ

"అంటే ఓళనుకున్నావ్?"

"ఆడి మావఁ కూతురు"

"నూర్నెంబరు పంచినాగుంటాది గుంట"

"అచ్చంగా తను సినిమాల సావిత్తిరేననుకుం టాంది"

అంటే మనసైందట, ఆ గుంటకి ఈ ముసిల్దంటే ఒళ్ళు మంటట ఈ ముసిల్దానికి రెండు కళ్లూ పువ్వులేసి పోయే "ఏటన్నేయం ఐపోద్దో ఏటోనని సీముండా! మా యమ్మున్నన్నాళ్లూ నా కగపడక అని తగిలేని, ఈ రెక్కల్లేసి పచ్చిని గూట్లో ఎట్టుకుని ఆ సీరామ చంద్రుడు" కాలం వెళ్ళపుచ్చుతున్నాట్ట. ఇప్పుడీ ముసిల్దానికి రోజుగోరి తోటనో పాడ్నుయ్యే గతి. ఈ ముండకి యిన్ని గంజినీళ్లోసే వోళ్లెవరూ నేరు. సస్తే కాటికి కాళ్ళెట్టు కీడిసేసే వాళ్ళుకూ ఆడా నేరు"

"మరిప్పుడీ ముసల్దేమౌతుంది?" ఆదుర్దాగా అడిగేడు సిరాజ్.

ఎవరూ మాటాళ్ళేదు. వాళ్ళనింకా అదిమి పట్టు కుంటున్నట్టు చీకటి కదిలింది. ఈలోగా చివర్ని కూర్చున్న కుర్రాడొకడు ముందుకొచ్చేడు. ఆత్మ విశ్వాసంతో నురగలు కక్కుతున్న పందెపు గుర్రంలా, ఎక్కుపెట్టిన బాణంలా వున్నాడు. తనా, పరా తెలియని యవ్వనంలో వున్నాడు. "మా వన్నా సచ్చిపోనావా దొరా" అని సిరాజ్‌తో అని, "నెగే, ముసల్దానా! నా నుండగా నీ కొచ్చిన బయవేఁన్నేదు" అని ముసల్దానితో అని ఆమెని లేవదీసేడు.

దూరంగా ఒక మెరుపు మెరిసింది

చీకటి చీలింది.

(ఓ రోజూ ఆస్పత్రిలో ఒకే ఒక అతిమంచి సూదిమందు వుంది. బజార్లో అది స్టాకులోలేదు. అదివ్వకపోతే ఓ గొప్ప పేషెంటు చస్తాడు. అదివ్వకపోతే వో పేద పేషెంటూ చస్తాడు. ఆ యిద్దరిలోనూ ఆ మందు ఎవరికివ్వాలి? ఎవరికిస్తారు? అందువల్ల ఫలితాలేవింటి? కథ రాయొచ్చు" అని శ్రీ రాచకొండ విశ్వనాథశాస్త్రిగారు చేసిన సూచన ఆధారంగా....)

**(జయశ్రీ, 1.6.1966)**

# జ్యోతిషం

దేశాన్ని పట్టుకున్న ముసురు పదిరోజులై వదల్లేదు. నాలాంటి తిరుగుడుద్యోగం వాళ్ళూ, ప్రాణం మీదకొచ్చిన వాళ్ళూ తప్ప, ఎవరూ ప్రయాణాలే చేస్తున్నట్టు లేదు ఈ ముసురువల్ల. అంచేత ఈ ఆల్‌థర్డు రైల్లో కూడా నాకంపార్టు మెంటులో నేను కాక మరో యిద్దరే వున్నారు. ఒకడుతంపిలో కుక్కలా ముడుచుకొని పడుకున్నాడు. రెండో ఆయన పెద్ద దేశభక్తుళ్ళా పదో నెంబరు గుడ్డలు వేసుకున్నాడు. అతని చేతి సంచినిండా కోర్టు రికార్డుంది. అతని కళ్ళనిండా దగావుంది. అతని తలమీద యెన్ని వెంట్రు కలున్నాయో, తల్లో అన్ని పేచీలున్న లిటిగేషను మనిషిలా వున్నాడు. అంచేత, అతన్తో మాట్లాడాలనిపించక, పొగమంచు ఫోటోలా కిటికీలోంచి కనిపిస్తున్న దృశ్యాన్ని చూస్తూ కూర్చున్నాను.

ఈలోగా, ఎవరో రైతుల్లా వున్నారు– ఒక మగా, ఒక ఆడా మా పెట్టె ఎక్కి తడిసిన బట్టలు పిడుచు కుంటూ తలుపు దగ్గరే నిలబడ్డారు. ఆ ఆడమనిషే బలంగా, ఎత్తుగా, లావుగా, కర్క శంగా, ఏ మంత్రాల మర్రినుంచో సరాసరి నడిచొచ్చేసిన